**నేటి 'స్పీడు' యుగంలో మనం యాంత్రికంగా జీవితం గడిపేస్తుంటాము. కొంత కాలానికి దిగులు కలుగుతుంది. ఆ దిగులు పోగొట్టుకోవడానికి డబ్బు కంటే విలువైన వస్తువు లున్నాయి. వాటిని చవిచూసిన వారి బ్రతుకు ధన్యం! అవే వెలకట్టలేనివి!**

డాక్టర్ ఆనంద్ వచ్చేసరికి ముకుందరావు సోఫాలో కూర్చుని ఉన్నాడు. ఆనంద్‌ను చూసి ఆప్యాయంగా ఆహ్వానించాడు. వా ళ్ళిద్దరూ బాల్య స్నేహితులు.

"అర్జెంటుగా రమ్మని ఫోన్ చేశావు. ఏమిటి విశేషం?" అడిగాడు ఆనంద్ కూర్చుంటూ.

ముకుందరావు గట్టిగా నిట్టూర్చి - "ఏమిటో, ఈ మధ్య ఒంట్లో బాగుండడం లేదురా! మనసులో ఎందుకో దిగులుగా ఉంటోంది. భోజనం కూడా తినబుద్ధి కావడంలేదు" అని చెప్పాడు.

"వ్వాట్! నీకు దిగులా? అయిదు ఫాక్టరీలకు అధిపతివి. పెద్ద పారిశ్రామికవేత్తవు. నీకు దిగు లేమిటి? ఇంతకీ ఇది బిజినెస్‌కు సంబంధించిన దిగులా?"



'కా' దన్నట్లుగా త లూపాడు మకుందరావు.

"మరి నీ బాధకు ..." ఆనంద్ మాట పూర్తి కాకముందే "హాయ్ డాడ్! హాయ్ అంకుల్!" అంటూ అప్పుడే కాలేజి నుంచి వచ్చిన ముకుందరావు కూతురు ప్రియ విష్ చేసి, సుడిగాలిలా లోపలికి దూసు కెళ్ళింది.

అంతలో లోపలి నుంచి ముకుందరావు భార్య వాచీలో టైమ్ చూసుకుంటూ వచ్చి ఆనంద్‌కు నమస్కారం చేసింది. "ఈ మధ్య ఈయన కాస్త అనీజీగా ఫీలవుతున్నారు. కాస్త మంచి మందు లివ్వండి అన్నయ్యగారూ!" అని ఆనంద్‌కు చెప్పి, "నాకు మహిళామండలి మీటింగ్‌కు టైమైంది. నే నొచ్చేసరికి లేటవుతుంది. మీరు భోం చేయండి" అని ముకుందరావుకు చెప్పి వెళ్ళిపోయింది.

ఆనంద్ ముకుందరావును చెకప్ చేశాడు. లోప మేమీ కనిపించలేదు. కొంచెం సేపు ఆలోచించి, ఏవో మందులు రాసి కరెక్ట్ టైముకి వాడమని చెప్పి వెళ్ళిపోయాడు.

నెల రోజులు గడిచిపోయాయి. ముకుందరావు పరిస్థితి ఏమీ మెరుగుపడలేదు. రోజు రోజుకు మనిషి నీరసించిపోసాగాడు. అతని జబ్బేమిటో ఆనంద్‌కు అర్థం కాలేదు, ఒక రోజు రాత్రి తీవ్రంగా ఆలోచించగా హఠాత్తుగా ముకుందరావు జబ్బుకు కారణ మేమిటో తెలిసిపోయింది.

మరునటి రోజు ముకుందరావుతో చెప్పాడు ఆనంద్ - "నీకు గాలి మార్పు అవసరం" అని.

"గాలి మార్పు కోసం నేను వేరే ఊరు వెళ్ళే పరిస్థితి నా కుందంటావా ఆనంద్? నేను ఊళ్ళో లేకపోతే ఫాక్టరీలు ఎవరు చూసుకుంటారు?" నీరసంగా చెప్పాడు ముకుందరావు.

"ఆ విషయం నాకు తెలుసు. అందుకే నీ కభ్యంతరం లేకపోతే మా ఇంటికి రా! నీకు తెలుసుగా, నేను ఈ టౌనుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూరి నుంచి రోజూ స్కూటర్ మీద వచ్చిపోతుంటా నని. నువ్వు ఏదో ఒక టైంలో ఫాక్టరీల పని చూసుకుని, మిగత రోజంత మా ఇంట్లో గడుపు. ఒక పదిరోజులు ఉండు. చాలు! అదీ నీకు నచ్చితేనే సుమా!" చెప్పాడు ఆనంద్.

ముకుందరావు అందుకు సమ్మతించాడు.

ఆనంద్ ఇంట్లో ఆనంద్ భార్య, ఇద్దరు కుమార్తెలు ఉంటారు. ముకుందరావును సాదరంగా ఆహ్వానించి, అభిమానంగా చూడసాగారు.

ఆ ఇంట్లో అంత ఒక పద్ధతి ప్రకారం జరిగిపోతూ ఉంటుంది. ఆ ఇంట్లో ఆడవాళ్ళు ఉదయాన్నే లేచి, స్నానం చేసి తులసి పూజ చేస్తారు. తర్వాత రోజువారీ కార్యక్రమాల్లో మునిగిపోతా రు. ఆనంద్ ఉదయాన్నే డ్యూటీకి వెళ్ళి సాయంత్రా నికల్లా ఇంటికి తిరిగి వస్తాడు. అందరూ కలసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేస్తారు.

రోజంత ఆనంద్ కూతుళ్ళలో ఎవరో ఒకరు ముకుందరావుతో కబుర్లు చెపుతూ ఉంటారు. క్రమంగా ముకుందరావులో దిగులు మాయమైంది. ఆ స్థానంలో సంతోషం, ఉత్సాహం చోటు చేసుకున్నాయి. ఆ కుటుంబంలోని వాతావరణం, వారి ప్రవర్తన అతన్ని ఎంతో ఆకట్టుకున్నాయి. తన కుటుంబంలో తన భార్య, కూతురు ఏ విధంగా ప్రవర్తిస్తారో గుర్తుకు వచ్చింది. తా మందరూ కలసి కూర్చుని మాట్లాడుకుని ఎన్ని రోజులైందో గుర్తుకు తెచ్చుకున్నాడు. తన కుటుంబంలో లేని దేమిటో ముకుందరావుకు పూర్తిగా అర్థమైంది.

పది రోజుల తర్వాత ముకుందరావు ఆనంద్ దగ్గర సెలవు తీసుకుంటున్నప్పుడు అతని కళ్ళు నీటితో నిండిపోయాయి. "ఇన్ని రోజులూ డబ్బుకంటే విలువైన దేదీ లేదని అనుకునేవాడిని. కానీ వెలకట్టి కొనలేని ప్రేమాభిమానాలు ఎంతో విలువైనవని మీ కుటుంబాన్ని చూసి తెలుసుకున్నాను. మీ కేమీ అభ్యంతరం లేకపోతే ప్రతి నెలా నాలుగురోజులు మీ ఇంట్లో గడుపుతాను" అన్నాడు గాద్గదిక స్వరంతో.

"ముకుందం! మనం మనుషులం - యంత్రాలం కాము. అందుకే ఎంత యాంత్రిక జీవనం గడుపుతున్నా మన మనసులు అప్పుడప్పుడూ ప్రేమాభిమానాల కోసం తల్లడిల్లుతూ ఉంటాయి. దాన్ని మనం సేద తీర్చాలి. నీ విషయంలో జరిగిం దదే. అది నీకు తెలియజేయా లనే ఇక్కడకు తీసుకువచ్చాను. నీ కుటుంబంలో మార్పు తీసుకురావడం నీ చేతుల్లో పని. తర్వాత నీకు ఇష్టమొచ్చినప్పుడు ఇక్కడకు వచ్చి వెళ్తుండు" అని అన్నాడు ఆనంద్ ఆప్యాయంగా.

★




## ఈ అనంత విశ్వంలో మనిషి

నిర్వాణ కామమతినైన నేను
విసర్జించిన ఈ జీర్ణ కులాలయం
విశీర్ణమైన తర్వాత కూడా
నా మహాభి నిష్క్రమణాన్ని నిరాకరిస్తూ
నా అస్థిపంజరం, నా రక్త మాంసాలు
స్నిగ్ధ రమ్యంగా నవ్వుతూ మళ్ళీ
నన్ను వెదుక్కుంటూ వస్తున్నవి

★

వయస్సంధిలో నే నాడుకున్న నా నేస్తాలు
నా చేతో వీథిలోకి పూవుదూపులు ప్రయోగిస్తూ
అచ్చర లేమల్లా హల్లీసకం చేస్తూ మళ్ళీ నాతో మన్మథా ద్వైత
సుఖవార్ధిలో తేలియాడ
అర్రులు చాస్తున్నారు
బీడును హరితం చేసిన నాపై కృతజ్ఞతాభావంతో
వసుంధర కూడా నావైపు సజల నేత్రాలతో చూస్తూ
తన ఒడిలోకి నన్ను మళ్ళీ రమ్మంటున్నది

★

ఈ వాసంత విభావరి
తన గర్భంలో ఔర్వానలం దాచుకున్న
ఈ సాగర సందోహం
ఈ గిరులూ, ఝురులూ నన్ను తిరిగి రా రమ్మని
మౌన ఘోష చేస్తున్నాయ్
కత్తి వాదరచేత, అణవ బలంతో
నేను చేసిన విధ్వంసం మరచి
ఈ ప్రకృతి కాంత కూడా నన్ను
తన అక్కున చేర్చుకోవాలని తహ తహ లాడుతోంది
చతురణుకాది క్రమంలో
నాతో ఉద్భూతమైన నా సోదర శక్తులు సైతం
నా పునరాగమనం కోసం ఆరాటపడుతున్నాయ్!

పాతమత్తిగిరి సుబ్రహ్మణ్యం